సాక్షి
అనంతపురం
గురువారం । 12 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.31,670

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31,670 పలికాయి.



కేశవా.. ఈ తిప్పలు చూడవా

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఇలాకాలోని ఆస్పత్రిలో అంధకారం నెలకొంది. సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.4°/23.8°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. పలు మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

వరుణ దేవా.. పంటలు బాగా పండేలా చూడు

- కలెక్టర్ వినోద్ కుమార్



ఎద్దులకు పూజ చేస్తున్న కలెక్టర్

కూడేరు: 'వరుణ దేవా కరుణించు. వర్షాలు సమృద్ధిగా కురిపించు. పంటలు బాగా పండేలా చేసి రైతులు ఆర్థికంగా ఎదిగేలా చూడు' అంటూ కలెక్టర్ వినోద్ కుమార్ ప్రార్థించారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం కూడేరు మండలం కొర్రకోడులో వ్యవసాయాధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి కలెక్టర్ వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎద్దులు, నాగలి, భూమికి పూజలు నిర్వహించారు. నాగలి పట్టి వేరుశనగ విత్తును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు అధికంగా కురిసే అవకాశాలున్నాయన్నారు. జిల్లాలో విత్తన వేరుశనగ పంపిణీ ఇప్పటికే మొదలైందని, రైతులకు విత్తన కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. రైతులు యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని తెలియజేశారు. చిరుధాన్యాల పంటల సాగుకు ఆసక్తి చూపాలన్నారు. పలువురు రైతులకు మినీ కిట్స్, భూసార పరీక్షల కార్డులను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పే నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లిన కలెక్టర్

అనంతపురం అర్బన్: కలెక్టర్ వి.వినోద్‌కుమార్ బుధవారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వం ఏర్పాటై గురువారానికి ఏడాది పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు కలెక్టర్ విజయవాడ వెళ్లినట్లు సమాచారం. ఆయన తిరిగి 13న విధులకు హాజరవుతారని తెలిసింది.

'ఉపాధి'లో 16 రకాల పండ్ల తోటల పెంపకం



అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 16 రకాల పండ్ల తోటల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా తెలిపారు. జిల్లాలో 8,051 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టే విధంగా లక్ష్యం నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మామిడి, చీనీ, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, అల్లనేరేడు, చింత, సీతాఫలం, దానిమ్మ, అంజూరా, యాపిల్‌బేర్, అవకాడో, పనస, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు గులాబీ, మల్లె, మునగ తదితర పంటల సాగు కోసం అనుమతులను మంజూరు చేశారన్నారు. ఐదెకరాల్లోపు మెట్ట భూములున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

జీడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్లు



పంపుహౌస్ పని తీరును ట్రైనీ కలెక్టర్‌లకు వివరిస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌తో పాటు పరివాహక ప్రాంతంలోని కోనంపల్లి గ్రామంలో పంటలు, నీటి వినియోగాన్ని ట్రైనీ కలెక్టర్‌లు పరిశీలించారు. ఏపీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ట్రైనీ కలెక్టర్‌లు సచిన్ రహర్, నరేంద్ర పాడల్, పృథ్వీరాజ్‌కుమార్, సందీప్ రఘువంశీ, నాగ వెంకటసహిత్, పర్హిన్ జాహిద్, మనీషా బుధవారం జీడిపల్లి పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్డీఓ వసంత బాబు, తహసీల్దార్ అనిల్‌కుమార్ స్వాగతించారు. కోనంపల్లి వద్ద బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు నీటి వినియోగంపై డ్రిప్, స్ప్రింక్లర్ల పనితీరును ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్‌ను అడిగి తెలుసుకున్నారు. జీడిపల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన అంశాలను హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్, ఈఈ శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో మండల హార్టికల్చర్ అధికారి కృష్ణతేజ, ఎంపీఓ మల్లేష్, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.



❒ ఫొటోలో కనిపిస్తున్న భవనం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనిది. గత ప్రభుత్వంలో 'మనబడి నాడు–నేడు' కింద ఈ పాఠశాలకు రూ.1.94 కోట్లు కేటాయించారు. ఇందులో రూ. 75.50 లక్షలు ఖర్చు చేశారు. 9 తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. ఇవి ఇంకా పూర్తి కాలేదు. కిటికీలు, డోర్లు అమర్చలేదు. ఇవి పూర్తయితే విద్యార్థులకు తరగతి గదుల కొరత లేకుండా పోయేది. అయితే, ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏడాదవుతున్నా పనులను పట్టించుకోలేదు. చేసేదిలేక అసంపూర్తిగా ఉన్న గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు.

సమస్యల బడిలోకి స్వాగతం

నేడు మోగనున్న బడిగంట

- ఇంకా పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు
- ఎక్కడికక్కడ నిలిచిన తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు
- పూర్తిస్థాయిలో రాని స్టూడెంట్స్ కిట్లు
- పలు స్కూళ్లకు యూనిఫాం క్లాత్, బ్యాగులు, షూ పెండింగ్
- చాలా బడుల్లో పని చేయని ఆర్‌ఓ ప్లాంట్లు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: మొదటి రోజే విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 2,417 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలున్నాయి. ఇందులో 1–10 తరగతుల విద్యార్థులు 3,66,161 మంది చదువుకుంటున్నారు. బడితెరిచే నాటికి స్టూడెంట్ కిట్లు బడి పాయింట్‌కు చేరుస్తామని చెప్పినా...నేటికీ కొన్ని స్కూళ్లకు యూనిఫాం, బ్యాగులు, షూ పెండింగ్ ఉన్నాయి. అనంతపురం రూరల్ పరిధిలోని స్కూళ్లకు యూనిఫాం క్లాత్ సరఫరా చేసి అర్బన్‌లో మెజార్టీ స్కూళ్లకు సరఫరా చేయలేదు.రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ప్రాంతాల్లోనూ ఇదే సమస్య. 1వ తరగతి డిక్షనరీలు కొన్ని మండలాల్లో సరఫరా కాలేదు. ఈ పరిస్థితుల్లో తొలిరోజు కిట్లు కాకుండా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, డిక్షనరీలు మాత్రమే విద్యార్థులకు సరఫరా చేయాలంటూ ఎంఈఓలు, హెచ్‌ఎంలకు మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి.

నిధులు లేక నిలిచిన పనులు

గత ప్రభుత్వం 'నాడు–నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ బడుల్లో 11 రకాల మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ విద్యాలయాల్లా తీర్చిదిద్దింది. జిల్లాలో తొలివిడతగా 698 స్కూళ్లలో రూ. 201 కోట్లు ఖర్చు చేశారు. రెండోవిడతలో 1,079 స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేశారు. రూ. 384.67 కోట్లు కేటాయించి అందులో రూ. 190 కోట్ల దాకా ఖర్చు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నయాపైసా కూడా విడుదల చేయకపోవడంతో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఇక.. నిర్వహణ లేక చాలా స్కూళ్లలో ఆర్‌ఓ ప్లాంట్లు పని చేయడం లేదు. దీంతో విద్యార్థులకు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు.

ఇప్పటికీ పూర్తి కాని టీచర్ల బదిలీల ప్రక్రియ

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తి చేసి పునఃప్రారంభం నాటికి కొత్త స్కూళ్లల్లో చేరేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించినా.. పూర్తి కాలేదు. హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలయినా ఎస్జీటీల ప్రక్రియ కొనసాగుతోంది. స్కూల్ అసిస్టెంట్లు ఎవరైతే బదిలీలయ్యారో వారందరూ కొత్త స్కూళ్లకు వెళ్లాలి. అయితే వారి పాత స్థానంలోకి ఎవరూ రాకపోతే అలాంటి వారు వెనక్కురావాలి. ఈస్థానంలోకి మరొకరు వచ్చేదాకా అక్కడే కొనసాగాలి. తెలుగు, హిందీ ఎస్ఏలు, పీడీలు పాతస్థానాల్లోనే కొనసాగనున్నారు. లాంగ్వేజ్ పండిట్ల బదిలీలయ్యే దాకా వారు రిలీవ్ కావాల్సిన పనిలేదని అధికారులు స్పష్టం చేశారు.



- ఇవి అనంతపురం రూరల్ మండలం పాపంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు. ఈ స్కూల్‌లో 500 మందికిపైగా విద్యార్థులున్నారు. కేవలం ఐదు గదులు ఉన్నాయి. దీంతో రోజూ వరండాల్లో తరగతులు నిర్వహించేవారు. గత ప్రభుత్వంలో 'నాడు–నేడు' కింద నాలుగు తరగతి గదులు మంజూరయ్యాయి. 80 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాదవుతున్నా ఆ 20 శాతం పనులు నేటికీ పూర్తికాలేదు. అడ్మిషన్లు మొదలు కావడంతో వసతిపై హెచ్‌ఎం, టీచర్లు ఆందోళన చెందుతున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి



గత ప్రభుత్వంలో 'నాడు–నేడు' కింద గ్రామంలో పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. పనులు వేగవంతంగా జరిగాయి. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. అసౌకర్యాల మధ్యనే విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది. అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలను పూర్తి చేయాలి.

– దేవరెడ్డి, ఉంతకల్లు గ్రామం, బొమ్మనహాళ్ మండలం

ప్రభుత్వ బడులను పట్టించుకోలేదు



గత ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంతో అన్ని పాఠశాలల్లోనూ మౌళిక వసతులు కల్పించింది. అదనపు తరగతి గదుల నిర్మాణాలు చాలా స్కూళ్లలో 10–20 శాతం మాత్రమే పెండింగ్ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బడులను అసలే పట్టించుకోలేదు. నిధులు మంజూరు చేస్తే పెండింగ్‌లో ఉన్న గదులన్నీ అందుబాటులోకి వస్తాయి.

– కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

- మధ్యలోనే అలిగి వెళ్లిపోయిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



పరస్పరం దాడి చేసుకుంటున్న గుంతకల్లు నియోజకవర్గ నాయకులు నబీరసూల్, ప్రభాకర్

అనంతపురం టవర్‌క్లాక్: అనంతపురంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. సమావేశానికి ముఖ్యఅతిథిగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరయ్యారు. సీనియర్లను స్టేజీ పైకి పిలవనందుకు నిరసన తెలుపుతూ సీనియర్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్ కింద కూర్చున్నారు. అది గమనించిన షర్మిల కూడా వేదిక దిగొచ్చి కుర్చీపై కూర్చున్నారు. కాసేపటికి సమావేశం ప్రారంభం కాగా.. నాయకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. గుంతకల్లు నియోజకవర్గ నాయకులు ప్రభాకర్, నబీరసూల్ మధ్య గొడవ తారాస్థాయికి చేరుకుని.. నబీరసూల్‌పై ప్రభాకర్ చేయి చేసుకున్నారు. వారికి నచ్చజెప్పి సమావేశం కొనసాగించారు. షర్మిల మాట్లాడుతూ జిల్లాలో నాయకత్వలోపంతో పార్టీ అభివృద్ధి కాలేదని, ఇక్కడి సమస్యలపై అధిష్టానంతో చర్చించి త్వరలోనే అన్ని కమిటీలు వేస్తామని అన్నారు. ఈ క్రమంలోనే మళ్లీ గొడవ జరిగింది. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి జిల్లాలోని నాయకులను కలుపుకొని పోలేదంటూ పలువురు మండిపడ్డారు. దీంతో షర్మిల సమావేశం మధ్యలోనే ఆపేసి అలిగి వెళ్లిపోయారు.



అలిగి వెళ్లిపోతున్న షర్మిల

టీచర్ల సహనానికి కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ ఉన్నతాధికారులు మళ్లీ టీచర్ల సహనానికి పరీక్ష పెట్టారు. స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ తొలిరోజు మంగళవారం రసాభాస నడుమ రాత్రి 10.30 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి దాటినా కొనసాగిన విషయం తెలిసిందే. అయితే, అప్పటికీ జనరల్, ప్రిఫరెన్షియల్ కేటగిరీలకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తడం.. వాటిని సరి చేసే అవకాశం రాష్ట్ర అధికారులకే ఉండడంతో చేసేదిలేక అర్ధరాత్రి దాటిన తర్వాత కౌన్సెలింగ్ ప్రక్రియను ఉన్నతాధికారులు వాయిదా వేశారు.

ఉదయం 11 గంటలకు అని చెప్పి...

బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని,జాబితాలోని 1 నుంచి 500 సంఖ్య వరకు హాజరుకావాలంటూ ఉదయాన్నే ఉపాధ్యాయులకు మెసేజ్‌లు పంపారు. తర్వాత 2 గంటలకు వాయిదా వేశారు. అప్పటికీ స్పష్టత రాకపోవడంతో చివరకు సాయంత్రం 4 గంటలకు 1 నుంచి 350 సంఖ్య వరకు రావాలంటూ మెసేజ్‌లు పెట్టారు. ఎట్టకేలకు 4.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ పరిశీలించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు.



కౌన్సెలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు

వెబ్ ఆప్షన్ల బహిష్కరణ..

భాషా పండితుల (ఎల్‌పీ) బదిలీల్లో భాగంగా బుధవారం రాత్రి ఫైనల్ సీనియార్టీ జాబితా విడుదల చేశారు. అయితే, ఫిర్యాదులు స్వీకరించ కుండానే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ఆదేశాలు జారీ చేయడంపై భాషా పండితులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రక్రియను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

గుంతలో పడి టీచర్‌కు గాయాలు

రాత్రి దాకా సాగుతున్న కౌన్సెలింగ్ ప్రక్రియ టీచర్లకు లేని తిప్పలు తెచ్చిపెడుతోంది. కౌన్సెలింగ్ కేంద్రం వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ టీచర్‌కు గాయాలయ్యాయి. వివరాలు.. బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ టీచర్ పి. రామిరెడ్డి, బుక్కపట్నంలో ఎస్జీటీగా పని చేస్తున్న సుధారాణి దంపతులు. భార్య కౌన్సెలింగ్ నేపథ్యంలో బుధవారం పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ స్కూల్‌కు రామిరెడ్డి వచ్చారు. రాత్రి కావడంతో భోజనం కోసమని కేంద్రం నుంచి బయటకు వెళ్తూ చీకట్లో ప్రమాదవశాత్తు గుంతలో పడ్డారు. చేతికి తీవ్ర గాయాలైన ఆయనను తోటి టీచర్లు నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

నేడు కౌన్సెలింగ్ ఇలా...

క్రమ సంఖ్య 351 నుంచి 700 వరకు ఉన్న ఎస్జీటీలకు గురువారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు, క్రమ సంఖ్య 701 నుంచి 1,000 వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు

ప్రభుత్వ అలసత్వంతోనే దారుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

- నేడు వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- జిల్లా అధ్యక్షుడు అనంత వెల్లడి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అలసత్వంతోనే మృగాళ్లు దారుణాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. చట్టాలను అమలు చేయాల్సిన పోలీసులు తమ విధుల్లో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి కనువిప్పు కల్గించేలా వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఎస్టీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'అనంత' మాట్లాడుతూ రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో పాశవికంగా అత్యాచారానికి గురైన బాలిక.. తనకు జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పడానికి కూడా భయపడుతోందంటే రాష్ట్రంలో పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు హృదయ విదారక ఘటనలు జరిగాయన్నారు. ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూసేందుకు, చంద్రబాబు ప్రభుత్వానికి కనువిప్పు కల్గించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో ఉద్యమ కార్యాచరణ రూపొందించామన్నారు. పార్టీ వివిధ విభాగాల సమన్వయంతో ఇటీవల పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టామని, దీనిపై ఎస్పీ జగదీష్ స్పందించి సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఓ యువతికి అన్యాయం జరిగితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించి మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షలతో పాటు ఇంట్లో ఒకరికి ఉద్యోగం, 5 సెంట్ల స్థలం ఇచ్చి ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో తీరని అన్యాయానికి గురైన వారికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం కనీస చర్యలు కూడా తీసుకోలేదని దుయ్యబట్టారు. కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా ప్రకటించలేదంటే చంద్రబాబు ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంతో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ క్రమంలో బాధిత గిరిజన కుటుంబానికి, మైనర్ బాలికకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగే వరకు పోరాడాలని నిశ్చయించామన్నారు. భవిష్యత్తులో ఎవరైనా దుశ్చర్యలకు పాల్పడితే ఇబ్బందులు తప్పవని, మృగాళ్లకు శిక్షపడే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

భారీ ర్యాలీకి తరలిరండి...

గురువారం ఉదయం 10 గంటలకు నగరంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి సప్తగిరి, సంగమేశ్వర్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీలో ఎస్టీ సెల్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడే శ్రీనివాస్ నాయక్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఎస్టీలు తరలిరావాలని వారు కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, గోవింద్ నాయక్, ప్రధాన కార్యదర్శి గుజ్జల శివ, నగరాధ్యక్షులు గుజ్జల శివయ్య, సాకే రాజశేఖర్, రాజు నాయక్, సాకే మురళీ, సాకే ఆనంద్, ముంగా ప్రదీప్, సాకే నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలు..హత్యలు..కబ్జాలు

కూటమి పాలనకు ఏడాది

- అనతి కాలంలోనే దారుణాలకు కేంద్ర బిందువుగా ఉమ్మడి జిల్లా
- పూర్తిగా అదుపుతప్పిన శాంతిభద్రతలు
- దేశవ్యాప్తంగా కలకలం రేపిన బాలికపై సామూహిక అత్యాచార ఘటన
- జిల్లావాసులను భయభ్రాంతులకు గురి చేసిన గిరిజన యువతి దారుణ హత్య

సాక్షి ప్రతినిధి, అనంతపురం: భూకబ్జాలు, అక్రమణలు, హత్యలు, అత్యాచారాలకు కూటమి సర్కారు కేరాఫ్‌గా మారింది. చంద్రబాబు పాలనా పగ్గాలు చేపట్టి గురువారానికి ఏడాది పూర్తయిన నేపథ్యంలో.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కడ చూసినా ఇప్పుడు ఇదే చర్చ సాగుతోంది. ఏడాదిలోనే సర్కారు భారీ వైఫల్యాలను మూటగట్టుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని, మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్న భావన అందరిలోనూ నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో బడులకు పిల్లలను పంపాలంటేనే బాలికల తల్లిదండ్రులు భయపడుతున్నారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో పోలీసులు నిశ్చేష్టులై చూస్తుండడంతో సామాన్యులకు న్యాయం అందని ద్రాక్షగా మారింది.

చెరపట్టిన మైనింగ్ మాఫియా

హిందూపురం మొదలు తాడిపత్రి వరకూ అన్ని నదులనూ, వంకలనూ టీడీపీ నేతలు చెరపట్టారు. చిత్రావతి, హగరి నదులు ఇప్పటికే రూపు మారిపోయాయి. ఇక కొండలు, గుట్టలు ఏడాదిలోనే మాయమయ్యాయి. మైనింగ్, రెవెన్యూ శాఖలు ఈ విషయంలో జోక్యం చేసుకోవడం ఎప్పుడో మానేశాయి.



టీడీపీ నాయకుల చేతిలో దారుణ హత్యకు గురైన రాప్తాడుకు చెందిన దంపతులు (ఫైల్)

సూపర్ సిక్స్ మోసం..

'ఆరు పథకాలు మీ జీవితాలనే మారుస్తాయంటూ' ఎన్నికల ముందు ప్రచారం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని గాలికొదిలారు. 'అమ్మఒడి' లేదు, 'ఉచిత గ్యాస్ సిలిండర్లు' లేవు, రైతు సాయం లేదు, నిరుద్యోగ భృతి లేదు, ఇంటికో ఉద్యోగం లేదు. ఒక్కటంటే ఒక్క పథకమూ లేదు.

పేట్రేగుతున్న రౌడీషీటర్లు

అధికార అండతో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో రౌడీషీటర్లు పేట్రేగిపోతున్నారు. సామాన్యుల ఇళ్ల స్థలాలను కబ్జా చేస్తున్నారు. ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఖాళీ స్థలాలు కనిపిస్తే కంచె వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కలుగుల్లో దాక్కున్న రౌడీషీటర్లందరూ చంద్రబాబు సర్కారు పుణ్యమా అని నేడు దర్జాగా తిరుగుతూ రెచ్చిపోతున్నారు.

ఏడాదిలో నాలుగు హత్యలు

ఒక్క ఏడాదిలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగు హత్యలు జరిగాయి. వీటన్నింటి వెనుకా టీడీపీ వర్గీయులే ఉండటం గమనార్హం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే హిందూపురంలో మల్లికార్జున దారుణ హత్యకు గురయ్యారు. పాపిరెడ్డిపల్లెలో లింగమయ్యపై టీడీపీ నాయకులు దాడి చేసి చంపేశారు. రాప్తాడు మండలంలో దంపతులు ముత్యాలమ్మ, నారాయణరెడ్డిని పట్టపగలే నరికి హత్య చేశారు.

మహిళల్లో ఆందోళన..

రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికను 14 మంది సామూహిక అత్యాచారం చేసిన ఘటన రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా కలకలం రేపింది. అంతేకాదు ఇంటర్ విద్యార్థిని తన్మయిని అతి కిరాతకంగా చంపి పొలాల్లో పడేసిన ఘటన జిల్లా ప్రజలను నివ్వెరపోయేలా చేసింది. తాడిపత్రిలో ఐచర్ వాహనంలో ఓ బాలిక, పుట్లూరు మండలంలో మరో బాలిక అత్యాచారానికి గురయ్యారు.

మద్యం ఏరులు..

గతంలో ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు జరిగేవి. అప్పట్లో బహిరంగ మద్యంపై ఉక్కుపాదం మోపారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నడిచే మద్యం షాపులకు వేళాపాళా లేకుండా పోయింది. బెల్టుషాపులు, పర్మిట్‌రూములతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉంటుండటంతో పల్లెలు మత్తులో జోగుతున్నాయి.

కరెంటు బిల్లులతో లబోదిబో..

అధికారంలోకి వస్తే ఒక్కపైసా కరెంటు చార్జీ పెంచబోనని చెప్పిన చంద్రబాబు.. కరెంటు చార్జీలు పెంచి సామాన్యుల నడ్డివిరిచారు. రూ.800 బిల్లు వచ్చే మధ్యతరగతి కుటుంబానికి ఇప్పుడు రూ.1,500 వస్తోంది. కరెంటు చార్జీల పెంపుతో జనం అల్లాడిపోతున్నారు.

13న యువత, విద్యార్థులకు బాసటగా..

- కలెక్టరేట్ ముందు నిరసన
- జయప్రదం చేయాలని అనంత పిలుపు

అనంతపురం కార్పొరేషన్: ఏడాదిగా ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను దగా చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు వైఎస్సార్ సీపీ ఈ నెల 13న కలెక్టరేట్ ముందు తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యువత, విద్యార్థులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా యువత, విద్యార్థులకు అండగా నిలుస్తామన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ శాఖ బదిలీల్లో గందరగోళం

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖలో ఏడీఏ, ఏఓ స్థాయి అధికారుల బదిలీల్లో గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి బదిలీల జాబితాను అధికారులు విడుదల చేశారు. వెనువెంటనే చిన్నపాటి మార్పులు ఉన్నాయంటూ మంగళవారం సాయంత్రం వాటిని వెనక్కి తీసుకున్నారు. బుధవారం ఉదయం జాబితా విడుదలవుతుందని ఎదురు చూసిన ఉద్యోగులకు భంగపాటు తప్పలేదు. ఈ క్రమంలో మధ్యలో ఏమి జరుగుతుందనే ఆందోళన కొందరు అధికారుల్లో నెలకొంది. పలుకుబడి, ముడుపులు ఇచ్చి ఎలాగోలా కోరుకున్న స్థానం పొందిన వారిలో ఈ పరిస్థితి మరీ తీవ్రంగా ఉంది. ఇదే అదనుగా మరికొందరు ఉద్యోగులు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని అంతో ఇంతో ముడుపులు ఆశ చూపి తాము కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇంకొందరు ప్రజాప్రతినిధుల వెంట పడ్డారు.

పశుశాఖలోనూ అదే తీరు

పశుసంవర్ధకశాఖలోనూ బదిలీ ఉత్తర్వులు వెలువడిన తక్షణమే వెనక్కి తీసుకోవడంపై అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. డీడీ క్యాడర్, ఏడీలు, పశువైద్యుల (వీఏఎస్) బదిలీ జాబితాపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇక్కడ కూడా ఎలాగోలా కోరుకున్న స్థానాలు పొందిన వారు మళ్లీ ఎక్కడ తారుమారు అవుతాయనే ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఉరవకొండ డివిజన్ డీడీ డాక్టర్ జి.వెంకటేష్‌ను హిందూపురం డివిజన్‌కు, స్థానిక పశువ్యాధి నియంత్రణా ప్రయోగశాల (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్రను కర్నూలుకు బదిలీ చేసినట్లు సమాచారం.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి టౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్న 12 మంది బీటర్లను బుధవారం ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి నేతృత్వంలో సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ గౌస్‌బాషా అరెస్ట్ చేసారు. వారి వద్ద నుంచి రూ.3.05 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

కేశవా... ఈ తిప్పలు చూడవా!



సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో వైద్యం అందిస్తున్న దృశ్యం



కరెంట్ లేక పోవడంతో జనరల్ వార్డు బయట కూర్చొన్న రోగుల బంధువులు

ఉరవకొండలోని 50 పడకల ఆస్పత్రిలో అంధకారం అలుముకుంది. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా లేక రోగులు, వారి బంధువులు అవస్థలు పడుతున్నారు. ఉక్కపోత, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి. ఆస్పత్రిలో జనరేటర్ పనిచేయడం లేదు. దీనికి తోడు ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన ఇన్వర్టర్ కూడా మొరాయిస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి అపస్మారక స్థితిలో వచ్చిన ఆమిద్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో చికిత్స అందించాల్సి వచ్చింది. . రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలోనే ఈ దుర్భర పరిస్థితి నెలకొనడం గమనార్హం. – ఉరవకొండ:



చీకట్లో అవస్థలు పడుతున్న జనరల్ వార్డులోని రోగులు

నూతన లబ్ధిదారుల్లో 'భరోసా' టెన్షన్

- ఇప్పటి వరకూ జమ కాని కొత్త పింఛన్ల సొమ్ము

అనంతపురం క్రైం: కూటమి ప్రభుత్వ ప్రణాళిక లేని హామీలతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల సంగతి సరేసరి... 2023 నుంచి జనవరి, 2024 వరకు పింఛన్ పొందుతూ మృతి చెందిన లబ్ధిదారుల భార్యలకే సదరు లబ్ధి చేకూరుస్తామంటూ ప్రకటించారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా కొత్తగా 2,796 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. ఇక్కడ వరకూ అంతా బాగున్నా... ఈ పింఛన్లకు సంబంధించి రూ.1.19 కోట్ల సొమ్మును ఖజానాకు జమ చేయకపోవడంతో లబ్ధి ఎలా చేకూర్చాలో అర్థం కాక అధికారులు తలలు బాదుకుంటున్నారు. 11వ తేదీ జమ కావాల్సిన నగదు సాయంత్రం 6 గంటలైనా కాలేదు. దీంతో ఈ నెల 12, 13 తేదీల్లోనైనా పింఛన్లను పంపిణీ చేస్తారో.. లేదోననే ఆందోళన నూతన పింఛన్‌దారుల్లో వ్యక్తమవుతోంది. అయితే ఆర్‌బీఐలో సాంకేతిక సమస్య కారణంగా డబ్బు జమ కావడం లేదంటూ లబ్ధిదారులను మభ్య పెట్టే ప్రయత్నాలకు డీఆర్‌డీఏ అధికారులు తెరతీశారు. ఈ విషయంపై డీఆర్‌డీఏ పీడీ శైలజను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించక పోవడం విశేషం.

పరాకాష్టకు రెడ్‌బుక్ పాలన

ఉరవకొండ: రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన పరాకాష్టకు చేరిందని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో 'సాక్షి' మీడియాపై కక్ష సాధింపులకు దిగడం హేయమన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వ అక్రమాలు, దురాగతాలపై ప్రశ్నిస్తున్న 'సాక్షి' మీడియాపై సీఎం చంద్రబాబు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఓ డిబేట్‌లో జర్నలిస్ట్ చేసిన వ్యాఖ్యలను ప్రణాళిక ప్రకారం వివాదాస్పదం చేశారన్నారు. ఆ వ్యాఖ్యలతో సంబంధం లేకున్నా సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా రెచ్చగొట్టే ధోరణితో టీడీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. 'సాక్షి' యాజమాన్యంతో పాటు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతికి ఆపాదిస్తూ అత్యంత దారుణంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడంతోనే 'సాక్షి' కార్యాలయాలపై దాడులకు తెగబడ్డారన్నారు. కూటమి ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజా స్పందన వచ్చిందని, దీన్ని జీర్ణించుకోలేక మీడియాపై దాడులకు పక్కా ప్రణాళిక రచించారన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

పోలీసుల వైఫల్యంతోనే తన్మయి హత్య

అత్యంత దారుణంగా హత్యకు గురైన గిరిజన విద్యార్థిని తన్మయి కేసులో పోలీసుల వైఫల్యం కన్పిస్తోందని 'విశ్వ' పేర్కొన్నారు. రాష్ట్రంలో టీడీపీ నేతలే కీచకులుగా మారి మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో 188 మంది మహిళలపై లైగింక దాడులు జరిగాయన్నారు. ఇంత జరుగుతున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్లు మూసుకున్నారా అని ప్రశ్నించారు. మహిళలపై జరుగుతున్న దాడులకు బాధ్యత వహించి హోం మంత్రి అనిత వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేరుకే 'మహా ప్రస్థానం'



ప్రైవేట్ అంబులెన్స్‌లో మారెక్క మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో నాలుగు మహాప్రస్థానం వాహనాలు ఉండగా ఇందులో ఏ ఒక్కటీ అత్యవసరం సమయంలో నిరుపేదలకు ఉపయోగ పడడం లేదు. సర్వజనాస్పత్రికి చికిత్స కోసం వచ్చిన కంబదూరు మండలం పి.వెంకటాంపల్లికి చెందిన హరిజన మారెక్క(48) బుధవారం మృతి చెందింది. దీంతో వార్డు గోడలపై ఉన్న మహాప్రస్థానం వాహనం కోసం ఉదయం 9.30 గంటలకు మృతురాలి కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. అయితే మహాప్రస్థానం వాహనం అందుబాటులో లేదని, రావడానికి రాత్రి 7 గంటలవుతుందని డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ ఫోన్ కట్ చేశాడు. దీంతో మారెక్క కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులను సంప్రదించారు. బాధితుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు పెద్ద మొత్తంలో డిమాండ్ చేశారు. పలుమార్లు ప్రాధేయపడిన తర్వాత చివరకు రూ.5,500తో ఒప్పుకుని మృతదేహాన్ని తరలించేందుకు ముందుకు వచ్చారు. ఆస్పత్రిలో రోజూ 6 నుంచి 10 మంది మృత్యువాత పడుతున్నారు. ఈ మృతదేహాలను తరలించేందుకు గత ప్రభుత్వంలో అప్పటి ఎంపీ తలారి రంగయ్య తన కోటా నిధుల్లో నుంచి రూ.10 లక్షలు వెచ్చించి మహాప్రస్థానం వాహనాన్ని సమకూర్చారు. ఈ వాహనాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. అయితే ఆ వాహనానికి ఇంధనం సమకూర్చకపోవడంతో మూలన పడింది. ఇదే విషయమై ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. త్వరలో వాహనం రెగ్యులర్‌గా తిరిగేందుకు ప్రత్యేక బడ్జెట్‌ను ఏర్పాటు చేసేలా కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్డీటీతో ముడిపడిన పేదల భవిష్యత్తు





మాట్లాడుతున్న శైలజానాథ్ (చిత్రంలో) రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ - రంగయ్యతో కలసి పాదయాత్ర చేస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి, రమేష్‌గౌడ్, ఉమా, తిప్పేస్వామి

- అవసరమైతే అనంతపురం వరకూ పాదయాత్ర
- మాజీ మంత్రి సాకే శైలజనాథ్

కళ్యాణదుర్గం: ఆర్డీటీ పరిరక్షణ అనేది కరువు ప్రాంత అభివృద్ధి, పేదల భవిష్యత్తుతో ముడిపడి ఉందని శింగనమల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ అన్నారు. సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయించే అంశంపై టీడీపీ నేతలు ఢిల్లీకి వెళ్లి మాట్లాడలేరని, కనీసం సీఎం చంద్రబాబును సైతం ప్రశ్నించలేని స్థితిలో జిల్లా ప్రజాప్రతినిధులు ఉన్నారని మండిపడ్డారు. మాజీ ఎంపీ రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర బుధవారం కంబదూరు మండలం ఓబిగానిపల్లి గేట్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మీడియాతో శైలజనాథ్ మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ అంశంపై కూటమి నేతలు ఎకసెక్కాలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. కేవలం రాజకీయం కోసమే పాదయాత్ర చేస్తున్నారంటూ టీడీపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం రాజకీయాల కోసమే కూటమి ఏర్పడిందనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తించాలన్నారు. జిల్లాలో ఆర్డీటీ ద్వారా లబ్ధి పొందిన అనేక మంది పాదయాత్రలో పాల్గొంటున్నారని, వారే కాక స్థానిక ఎమ్మెల్యే కూడా నడిస్తే తామేమీ వద్దనమని అన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ కోసం రెండోసారి కూడా దరఖాస్తు చేసుకోవాలనే ఆలోచన కూడా కొనసాగుతోందన్నారు. రెండో సారి దరఖాస్తు చేసుకుంటే ఇక మీ గొప్పతనం ఏముంటుందని ప్రశ్నించారు. పేదలు జీవించే హక్కును పాదయాత్ర నిర్ధారిస్తోందన్నారు. వారు చదువుకునే హక్కు...జీవించే హక్కును రంగయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర స్పష్టీకరిస్తుందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏనాడూ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ ఆగలేదని గుర్తు చేశారు. ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ తీసుకురావాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందన్నారు. ఆర్డీటీకి తామంతా తోడున్నామని, అవసరమైతే అనంతపురం వరకూ పాదయాత్ర చేపట్టి ఆర్డీటీ పరిరక్షణ ఆవశ్యకతపై ప్రజలను చైతన్య పరుస్తామన్నారు.

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ... ఆర్డీటీ మూతపడితే ఇక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. జిల్లాకు జీవనాడిగా ఉన్న ఆర్డీటీని కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ... 55 ఏళ్లుగా పేదలకు నిస్వార్థ సేవలందిస్తున్న ఏకైక సంస్థ ఆర్డీటీనే అని కొనియాడారు. చేయి చేయి కలిపి ఆర్డీటీని కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, పార్టీ కన్వీనర్ హనుమంతరాయుడు, ఎంపీపీ భీమేష్, సర్పంచ్ సంధ్యాహరినాథ్, జిల్లా కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడుతో పాటు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ఆర్డీటీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని సాకే శైలజనాథ్ విమర్శించారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేతలతో కలసి బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నేతల దౌర్జన్యాలు, అరాచకాలను వెలుగులోకి తీసుకువచ్చారన్న అక్కసుతో సాక్షి టీవీ, పత్రికపై అక్కసు వెళ్లగక్కడం సరికాదన్నారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని సాక్షి ప్రధాన కార్యాలయంపై టీడీపీ నాయకులు సాగించిన దాడి యత్నాన్ని ఖండించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయని చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని మండిపడ్డారు. సాక్షి కార్యాలయాలపై దాడులు, వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలు దిగడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మంచి చేయడంపై ఈ పాలకులకు లేదన్నారు.

'ప్రిఫరెన్షియల్'లో దుర్వినియోగం

- కార్యాలయ సిబ్బంది నిర్వాకంపై డీఈఓకు ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులు



డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఈఓ కార్యాలయ సిబ్బంది నిర్వాకం కారణంగా ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ దుర్వినియోగమైందని డీఈఓ ప్రసాద్‌బాబుకు పలువురు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను బుధవారం డీఈఓను కలిసి అందజేశారు. నగరంలోని కేఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏ ఇంగ్లిష్‌కు సంబంధించి ఆరు పోస్టులుండగా కొత్త బదిలీల చట్టం ప్రకారం 50 శాతం అంటే మూడు పోస్టులు ప్రిఫరెన్షియల్ కేటగిరీకి చూపించాల్సి ఉందన్నారు. అయితే ఏకంగా ఐదు పోస్టులను ఇచ్చారన్నారు. ఈ కారణంగా సీనియారిటీ జాబితాలో ఉన్న టీచర్లకు నష్టం వాటిల్లిందని మండిపడ్డారు. పీహెచ్ (అంధులు) కేటగిరీ కింద ధర్మవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆదిమూలం శ్రీనివాసులు పీహెచ్ కేటగిరీని వదిలి జనరల్ కేటగిరీకి దరఖాస్తు చేసుకుంటున్నట్లు తన ఇష్టపూర్వక లేఖను సమర్పించారన్నారు. ఈ లెక్కన ఆయన పేరును జనరల్ కేటగిరీలో చూపిస్తే తర్వాత ఉన్న మహిళా టీచర్‌ను బాలికల పాఠశాలకు కేటాయించకుండా పురుష టీచరును నియమించారన్నారు. చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న జెడ్పీ యాజమాన్య టీచర్లు తిరిగి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలను ఎంచుకున్నారన్నారు. అక్రమ బదిలీలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. తర్వాత సీనియారిటీలో ఉన్న అర్హులైన ఉపాధ్యాయులకు ఆ స్థానాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.


'సాక్షి' కార్యాలయాలపై దాడి హేయం

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుతున్న 'సాక్షి' మీడియాపై కక్ష కట్టి దాడులు చేయడం దుర్మార్గమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేఎస్సార్ లైవ్ షో ద్వారా ఎన్నో ప్రజా సమస్యలు వెలుగులోకి తెస్తున్న సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ రాజకీయ కక్షలో భాగమేనని అన్నారు. ఓ వ్యక్తి చేసిన వివాదస్పద వ్యాఖ్యల ఆధారంగా కేఎస్సార్‌ను అరెస్ట్ చేయడం సబబు కాదన్నారు. మహిళలపై పట్టపగలే అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు.. కేఎస్సార్ విషయంలో ఆగమేఘాలపై స్పందించడం కుట్రలో భాగమేనని మండిపడ్డారు.

నీట మునిగి యువకుడి మృతి



భరత్‌కుమార్ (ఫైల్)

కూడేరు: రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. అనంతపురంలోని రంగారెడ్డి కాలనీకి చెందిన ప్రసాద్, విశాల దంపతులకు కుమారుడు భరత్‌కుమార్ (22) బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో ఉద్యోగం రావడంతో వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో స్నేహితులు ఉమామహేష్, అనిల్‌తో కలసి బుధవారం పీఏబీఆర్ సందర్శనకు వెళ్లారు. సరదాగా నీటిలో ఈత కొడుతుండగా లోతుగా ఉన్న ప్రాంతానికి చేరుకున్న భరత్ నీట మునిగాడు. స్నేహితులు గాలించి వెలికి తీసేలోపు ఊపిరి ఆడక మృతిచెందాడు. ఘటనపై కూడేరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'కూటమి' తీరుతో సీమ ప్రాజెక్టులు నిర్వీర్యం

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య ధ్వజం

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పెద్దల తీరుతో రాయలసీమ ప్రాజెక్టులు నిర్వీర్యమవుతున్నాయని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమకు నీరు ఇస్తామని తప్పుడు ప్రచారంతో గోదావరి బనకచెర్ల ప్రాజెక్ట్‌ను ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టేందుకు సీఎం చంద్రబాబు అత్యుత్సాహం చూపుతున్నారని, ఈ ఉత్సాహం కుమారుని ప్రయోజనం కోసమా? లేక కమీషన్ల కోసమా అనేది సీఎం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తే రాయలసీమ జిల్లాల్లోని హంద్రీ-నీవా, గాలేరి-నగరి, వెలుగొండ ప్రాజెక్టులు పూర్తయి ప్రతి ఎకరాకూ నీరు అందుతుందన్నారు. అలా కాదని రూ.82 వేల కోట్లు వ్యయంతో చేపట్టే బనకచెర్ల ప్రాజెక్ట్ కేవలం కమీషన్ల కోసమే తప్ప రైతుల ప్రయోజనం కోసం ఎంత మాత్రం కాదనేది స్పష్టతమవుతోందన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఇష్టానుసారంగా వాగ్దానాలు చేయడం... అధికారం చేజిక్కించుకున్న తరువాత వాటిని గాలికి వదిలేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ చేయడం ద్వారా రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. అంబానీ, ఆదానీలకు రూ.16 లక్షల కోట్ల అప్పులు రద్దు చేస్తారు కానీ... అన్నం పెట్టే రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించలేని అసమర్థ ప్రభుత్వం రాజ్యమేలుతోందని మండిపడ్డారు. రైతాంగ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, ఆర్గనైజింగ్ కార్యదర్శి వన్నారెడ్డి, నాయకులు వెంకటరాముడు, సూరి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

గాయపడిన మహిళా ఉద్యోగి మృతి



ముకుంద ప్రియ (ఫైల్)

ఓర్వకల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామ సచివాలయ మహిళా ఉద్యోగి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా వెంకటాంపల్లి గ్రామానికి చెందిన చంద్రారెడ్డి భార్య ముకుంద ప్రియ కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయం-2లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. భర్త చంద్రారెడ్డి ఆర్మీకి వెళ్లడంతో కర్నూలులో ఉంటున్న తల్లిదండ్రుల వద్ద నివాసముంటున్న ఆమె రోజూ కర్నూలు నుంచి స్కూటీపై విధులకు వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో గత నెల 20న విధులకు వెళ్తుండగా రోడ్డుపై నిలబడిన లారీని ఢీకొని గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందారు.

తాగుడు మానేయమంటే ఉరేసుకున్నాడు



మృతుడు రాజేష్

గుంతకల్లు: పాత గుంతకల్లు ప్రాంతానికి చెందిన వడ్డే రంగముని, సుజాత దంపతుల కుమారుడు వడ్డే రాజేష్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. డెకరేషన్ పనులతో కుటుంబానికి చేదోడుగా నిలిచిన రాజేష్... ఏడాదిగా మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు ఎంత చెప్పినా తన ప్రవర్తనను మార్చుకోలేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రాజేష్‌ను తల్లిదండ్రులు మందలించారు. దీంతో అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వారి సాయంతో రాజేష్‌ను ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

కుటుంబానికి అండగా ఉంటాం



మంగలి నరేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మంగలి నరేష్ కుటుంబానికి అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బాలేపాళ్యంలో గ్రామంలో పార్టీ కార్యకర్త నరేష్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. స్థానిక పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు బుధవారం బాలేపాళ్యం గ్రామానికి వెళ్లి మృతుడు నరేష్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

ఆత్మకూరు: అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఈఓ సుజిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ-కేవైసీ చేయించుకుంటేనే రైతులకు పథకం కింద పెట్టుబడి సాయం మంజూరువుతుందని వెల్లడించారు. ఈనెలలోనే అన్నదాత సుఖీభవ నగదు జమ అయ్యే అవకాశం ఉందన్నారు. రైతులందరూ వెంటనే ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

మూఢనమ్మకాలను వీడాలి



సభ్యత్వ నమోదులో జేవీవీ రాష్ట్ర నాయకులు

అనంతపురం కల్చరల్: మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ భావజాలమున్న సమాజాన్ని నిర్మించడానికి అందరూ సహకరించాలని జేవీవీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ సూచించారు. బుధవారం జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అశాస్త్రీయ భావజాలం పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తోందన్నారు. ప్రజలను చైతన్యవంతులు చేయడానికి జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. అయితే ఎక్కువ మంది సభ్యులతోనే ప్రచారం సాధ్యమని అందుకు ప్రతి జేవీవీ సభ్యుడు పూర్తి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో నానాటికి పెరిగిపోతున్న అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా జేవీవీ కేవలం పట్టణాలు, నగరాలకు పరిమితం కాకుండా గ్రామస్థాయి వరకు జేవీవీ భావజాలాన్ని తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు రామిరెడ్డి, జేవీవీ తిరుపాలు, లక్ష్మీనారాయణ, ప్రసాద రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రతం

అనంతపురం కల్చరల్: నగరంలోని సోమనాథ నగర్‌లో బుధవారం ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పురాణేతిహాసాల్లోని వటసావిత్రి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్యదేవి పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలతో కలిసి వ్రతం జరిపించారు. ఈ సందర్భంగా ఆమె సతీ సావిత్రి వృత్తాంతం గురించి మాట్లాడుతూ.. తన భర్త సత్యవంతున్ని ఏవిధంగా మృత్యువు భారి నుంచి కాపాడుకుందో వివరించారు. అలానే సకల సౌభాగ్యాలు, ఐదవతనం కోసం సువాసినీ స్త్రీలు ఆచరించే ముఖ్యమైన వ్రతంగా దీనిని అభివర్ణించారు. అనంతరం మహిళలందరికి తీర్థ ప్రసాద తాంబూలాలు, వాయనాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పంచాంగం సుభలక్ష్మమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



మృతురాలు రాధిక

గుమ్మఘట్ట: మండలంలోని దేవరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రవికుమార్ భార్య రాధిక (33) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వివరాలు.. రవికుమార్ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగించేవారు. నెల రోజుల క్రితం పనుల కోసమని బెంగళూరుకు రవికుమార్ వెళ్లాడు. ఇద్దరు పిల్లలతో రాధిక ఇంట్లోనే ఉండేది. మంగళవారం రాత్రి ఇంట్లో నీటితో ఇంటిని శుభ్రం చేస్తుండగా ఫ్రిజ్‌కున్న కేబుల్ డ్యామేజ్‌ను గమనించకుండా తాకడంతో షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకుంది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను రాయదుర్గంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై గుమ్మఘట్ట పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సెలవులకు టాటా.. ఇక బడిబాట



మోయాల్సిందే: ట్రంక్ పెట్టెతో హాస్టల్‌కు వెళ్తున్న బాలురు

వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచి బడి గంట మోగనుంది. ఇన్నాళ్లు సెలవులను ఆస్వాదించిన విద్యార్థులు పాఠశాలకు పరుగులు పెట్టాల్సిన సమయం వచ్చిసింది. బుధవారం నగరంలో బుక్ సెంటర్లు, వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. తమ పిల్లలకు తల్లిదండ్రులు పుస్తకాలు, పెన్నులు, బ్యాగ్స్, యూనిఫాం తదితర విద్యా సామగ్రి కొనుగోలు చేశారు. ధరలు పెరగడంతో సామాన్యులు కొంత మేర ఇబ్బందులు పడ్డారు. ఇక నగరంలో చదువుతూ ఊళ్లకు వెళ్లిన విద్యార్థులు పెట్టెల్లో సామగ్రి సర్దుకుని తిరిగి రావడం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



కొనాల్సిందే: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న బుక్‌షాప్



నాన్నోయ్ షూ కొనవా: షూ చూస్తున్న తల్లిదండ్రులు



ఇదే కావాలి: బ్యాగ్ కొనివ్వాలని మారాం చేస్తున్న బాలిక



ఓ పనైపోయింది: కొనుగోలు చేసిన వాటిని సరిచూసుకుంటున్న దృశ్యం

న్యాయం జరిగే వరకు పోరాడతాం

అనంతపురం కార్పొరేషన్: తన్మయి మృతి ఎంతో బాధించింది. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. బుధవారం రామకృష్ణ కాలనీలో ఉన్న తన్మయి తల్లిదండ్రులు అరుణ, లక్ష్మీపతిని మహిళా విభాగం నాయకురాళ్లు పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. అధైర్య పడొద్దని, ధైర్యంగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. తన్మయికి జరిగిన అన్యాయంపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ఆ అమ్మాయితో పాటు జిల్లాలో అఘాయిత్యాలకు గురైన యువతుల కోసం పోరాటాలు చేస్తోందని తెలిపారు. దశల వారీగా ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. తన్మయికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఇంత ఘోరం జరిగినా.. ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు దేవి, చంద్రలేఖ, భారతి, శోభారాణి, అంజలి, శోభాబాయి, అనురాధ, సుగుణ, జయమ్మ, మహేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



తన్మయి తల్లిదండ్రులు లక్ష్మీపతి, అరుణతో మాట్లాడుతున్న పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

పత్రికా కార్యాలయాలపై దాడి దుర్మార్గం

అనంతపురం టవర్‌క్లాక్: సాక్షి కార్యాలయాలపై కూటమి నాయకులు చేస్తున్న దాడులు అమానుషం. తక్షణం దాడులు ఆపాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధాని మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ సాక్షి కార్యలయాలపై దాడి, పేపర్లు తగుల పెట్టడం మంచిది కాదన్నారు. పత్రికలకు స్వేచ్ఛ ఉందని.. స్వేచ్ఛను హరించడం న్యాయం కాదన్నారు. ఇలాంటి దాడులను ప్రోత్సహించవద్దని సూచించారు. తప్పులు ఉంటే న్యాయపరంగా వెళ్లాలని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదన్నారు. ఒక డిబేట్‌లో వచ్చిన దానిపై కూటమి నాయకులు స్పందిచారన్నారు. అయితే దళిత, గిరిజనులపై హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే ఎందుకు స్పందించరని కూటమి నాయకులను ప్రశ్నించారు. రాజకీయాల కోసం దళిత, గిరిజనులను బలి చేయవద్దన్నారు. కుట్ర రాజకీయాలు వదిలి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆనంద్, కేపీ రాజు, గట్టు రామాంజనేయులు, మదమంచి శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్ జోన్ సీనియర్ వన్డే క్రికెట్ అంతర్ జిల్లా టోర్నీలో భాగంగా రెండో రౌండ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లా జట్ల మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 389 పరుగులు సాధించింది. జట్టులో సీఆర్ జ్ఞానేశ్వర్ 118 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 108 పరుగులు, బి.అభిషేక్‌రెడ్డి 128 బంతుల్లో 16 ఫోర్లతో 116 పరుగులు, ఏపీ సూర్య 32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 63 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వైఎస్సార్ కడప జట్టు 14.5 ఓవర్లలో 94 పరుగులు చేసి ఒక వికెట్ నష్టపోయింది. వర్షం రావడంతో మ్యాచ్‌ను రద్దు చేసి రెండు జట్లకు సమాన పాయింట్లు కేటాయించారు. కాగా, రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో చిత్తూరు జట్టు గణనీయమైన పాయింట్లు దక్కించుకోవడంతో అగ్రస్థానానికి ఎగబాకింది.

- కర్నూలు – నెల్లూరు జిల్లా జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 49.4 ఓవర్లలో 212 పరుగులు చేసి ఆలౌట్ అయింది. నయీముల్లా 86 బంతుల్లో 58 పరుగులు, ఎస్కే కమరుద్దీన్ 26 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 25.1 ఓవర్లలో 163 పరుగులు చేసి ఆరు వికెట్లు నష్టపోయింది. కె.నిఖిలేశ్వర రెడ్డి 38 పరుగులు, శోభన వర్మ 19 పరుగులు, రోషన్ పవన్ 40 పరుగులు సాధించారు. వర్షం రావడంతో డక్‌వర్త్ లూయిస్ విధానం ప్రకారం నెల్లూరు జట్టు గెలుపొందినట్లు ప్రకటించారు.



సీఆర్ జ్ఞానేశ్వర్



అభిషేక్ రెడ్డి

డబ్బు చెల్లించినా విద్యుత్ మీటర్లు ఇవ్వరా?

అనంతపురం టౌన్: విద్యుత్ మీటర్లు ఇవ్వడంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం సీపీఎం నాయకులు విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. డీ6 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మల్లు స్వరాజ్యం కాలనీలో నివాసముంటున్న పేదలు వారి ఇళ్ల కోసం 6 నెలల క్రితం విద్యుత్ మీటర్ల కోసం డబ్బులు చెల్లించారన్నారు. ఇప్పటి వరకు మీటర్లు ఇవ్వకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రెవెన్యు అధికారులతో ఎలాంటి ఇబ్బందులు లేకున్నా కుంటి సాకులు చూపుతూ మీటర్లు ఇవ్వకుండా పేదల ఇళ్లకు విద్యుత్ సరఫరా లేకుండా నిలిపివేశారన్నారు. గతంలో ఇదే కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తే.. అప్పటి అధికారులు మీటర్ల కోసం డబ్బులు చెల్లించండి వెంటనే విద్యుత్ మీటర్లు అందజేసి విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం మీటర్లకు డబ్బు చెల్లించి డీడీలు అందజేసిన విద్యుత్ మీటర్లు ఇవ్వకుండా అలసత్వం ప్రదర్శించడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే మీటర్లు అందజేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యుత్ శాఖ ఈఈ రమేష్ ఆందోళనకారులతో చర్చించారు. త్వరలోనే మీటర్లు అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రకాష్, మసూద్, లాలెమ్మ, మోహన్, నాగరాజు తదితరులతోపాటు మల్లు స్వరాజ్యం కాలనీ వాసులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

రాప్తాడు: సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి శాస్త్రవేత్త శశికళ సూచించారు. బుధవారం మండలంలోని హంపాపురం, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త శశికళ మాట్లాడుతూ.. వచ్చే ఖరీఫ్‌లో పంటల సాగులో తీసుకోవాల్సిన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి పలకాలన్నారు. పంటల సాగులో నూతన వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంటల సాగులో వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నూతన పద్ధతులు, వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. రైతులు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు వేయడం ద్వారా భూసార పెరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులు భూసార పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శ్రీవాణి, హెచ్ఈఓ శ్రీనివాస్, పీఎంఎఫ్‌బీవై సిద్ధేశ్వర్, ఆత్మా ఏటీఎం అనూరాధ, వీహెచ్ఏ పేర్సి, ఏఈఓ రంజిత, సర్పంచులు మిడతల శీనయ్య, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శశికళ

ఉపాధి బిల్లులు సకాలంలో చెల్లించాలి

ఆత్మకూరు: పంపనూరు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీపీ సుబ్బర హేమలత, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదు వారాలకు సంబంధించిన బిల్లులు అందలేదని కూలీలు వాపోయారు. అంతేకాకుండా వారం రోజులు పని చేస్తే కేవలం మూడు రోజులకే బిల్లులు వస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా వారికి అనుకూలంగా ఉన్న వారికి పని ఇస్తున్నారని పేర్కొన్నారు. మరి కొంత మందికి కష్టంగా ఉన్న ప్రాంతాల్లో పని కల్పిస్తున్నారని ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. బిల్లులు సకాలంలో పెట్టకుండా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమస్యలను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. ఎంపీపీ ఉపాధి హామీ కూలీలకు అంగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ మహిళా మండల కన్వీనర్ సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ హేమలత

మొక్కలు నాటాలి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. బుధవారం మండలంలోని పంపనూరు సిటీ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయన్నారు.

బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కల్చరల్: నగరంలోని బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామరాజ శర్మ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట రామరాజ శర్మ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో బ్రాహ్మణ భవన్ నిర్మించాలని కోరారు. బ్రాహ్మణ శ్మశాన వాటికలో వసతులు కల్పించాలని సూచించారు. ఇతరులతో కలిసి కాకుండా విడిగా బ్రాహ్మణులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాఖ్య జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే ఉపేక్షించం

అనంతపురం కార్పొరేషన్: ప్రాణాంతమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు సంబంధించి థర్మాకోల్‌లో ఏవిధంగా ఆహారాన్ని ప్రజలకు సరఫరా చేస్తారు? ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే ఉపేక్షించేది లేదని కమిషనర్ బాలస్వామి పానీపూరీ సెంటర్లు, కొన్ని తినుబండారాల షాపు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కమిషనర్ ఆదేశాలతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో నగరపాలక సంస్థ సిబ్బంది 10 బృందాలుగా వెళ్లి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు సెంటర్లను కమిషనర్ పరిశీలించి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రజలు సైతం థర్మాకోల్‌లో హాట్‌గా ఉండే ఆహారాన్ని ఏవిధంగా తీసుకుంటారని ప్రశ్నించారు. వేడి పదార్థాలు అందులో వేసినప్పుడు ప్లాస్టిక్ కరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ప్రజల్లో కూడా ప్లాస్టిక్‌పై అవగాహన రావాలన్నారు. రోడ్లపై, రెస్టారెంట్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఇస్తే తమకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. నగరంలోని నిబంధనలకు విరుద్ధంగా థర్మాకోల్‌తో ఆహారాన్ని అందించిన ఒక్కో షాపుపై రూ.1,000 జరిమానా విధించారు. పానీపూరీ సెంటర్లు, వాహనాల వారు ఇక నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని తదితరులు పాల్గొన్నారు.

'బదిలీ లేఖలను పరిగణనలోకి తీసుకోవద్దు'

అనంతపురం మెడికల్: ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రమేష్ బాబు పదవీ కాలం గడువు పూర్తయి రెండేళ్లు అయ్యింది. వారు ఇచ్చే బదిలీ లేఖలను పరిగణనలోకి తీసుకోకూడదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే చిరంజీవి కోరారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవిని కలసి వినతిపత్రం సమర్పించారు.

అనంతలో సోసలె వ్యాసరాజ మఠం పీఠాధిపతి

అనంతపురం కల్చరల్: రెండు రోజుల పాటూ సాగే హైందవ ధర్మప్రచారంలో భాగంగా సోసలె వ్యాసరాజ మఠం పీఠాధిపతి తీర్థ శ్రీపాదుల స్వామి బుధవారం రాత్రి అనంతకు విచ్చేశారు. పాతూరు వ్యాసరాజ మఠానికి విచ్చేసిన స్వామికి వేద పండితులు, మఠం ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మఠం అధికారి శ్రీకాంత్, మేనేజర్ హరినారాయణ, నాగరాజారావు, రఘునాథ్ మాట్లాడుతూ.. గురువారం ఉదయం 8 గంటల నుంచి 9:30 వరకు స్వామి భక్తులకు పవిత్ర ముద్రధారణ చేస్తారన్నారు.

ఉద్యోగి కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న టైం స్కేల్ ఉద్యోగి మహబూబ్ బాషా అనారోగ్యంతో మరణించారు. వర్సిటీలో పనిచేస్తున్న టైం స్కేల్ ఉద్యోగులందరూ మే నెలలో ఒక రోజు వేతనాన్ని మహబూబ్ బాషా కుటుంబానికి అందించేందుకు ముందుకొచ్చారు. సేకరించిన రూ.1,16,000 చెక్కును బుధవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత చేతుల మీదుగా మహబూబ్ బాషా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, టైం స్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు కె.చంద్రశేఖర్ నాయుడు, జనరల్ సెక్రెటరీ హెచ్‌బీ సంజీవప్ప, ట్రెజరర్ కె.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి.నారాయణప్ప, జి.నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

సీఐ జగదీష్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం: అనంతపురం నాలుగో పట్టణ సీఐగా ఎన్.జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పీటీసీ నుంచి నాలుగో పట్టణ సీఐగా బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న కె.సాయినాథ్‌ను వీఆర్‌కు పంపారు. ఈ సందర్భంగా సీఐ జగదీష్‌కు ఎస్ఐలు, కానిస్టేబుళ్లు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ జగదీష్ మర్యాదపూర్వకంగా అర్బన్ డీఎస్పీని కలిశారు.

ఘనంగా ఏరువాక పున్నమి

అనంతపురం కల్చరల్: ఏరువాక పున్నమి సందర్భంగా అన్నదాతలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రకృతి శోభిత పౌర్ణమిగా భావించే భక్తులు సాయి నగర్‌లోని కనకదుర్గమ్మను వివిధ ఆకుకూరలు, పండ్లు, కూరగాయలతో అందంగా అలంకరించి పూజించారు.

'స్పౌజ్' పాయింట్లపై రగడ

- రాత్రి గంట పాటు ఆగిన ఎస్జీటీల కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: స్పౌజ్ పాయింట్ల వినియోగంపై అధికారులు, ఉపాధ్యాయులకు బుధవారం రాత్రి గంటపాటు రగడ జరిగింది. ప్రిఫరెన్షియల్ క్యాటగిరి టీచర్ల బదిలీల అనంతరం జనరల్ టీచర్ల బదిలీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఈఓ ప్రసాద్ బాబు మాట్లాడుతూ స్పౌజ్ పాయింట్లు వినియోగించుకునేవారు భర్త/భార్య పనిచేస్తున్న స్థానానికి సమీపంలోకి వెళ్లాలి తప్ప.. ఎక్కడపడితే అక్కడికి వెళ్లడానికి వీల్లేదంటూ స్పష్టం చేశారు. దీనిపై కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు అభ్యంతరం చెప్పారు. జిల్లాలో ఎక్కడికైనా వెళ్లొచ్చనేది జీవోలో ఉందని, అందుకు విరుద్ధంగా ఎలా చెబుతారని నిలదీశారు. కమిషనర్ చాలా స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేశారని, ఆ మేరకు స్పౌజ్ వినియోగించుకునేవారు భర్త/భార్య సమీపంలోకే వెళ్లాల్సిందేనని డీఈఓ తేల్చి చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. దీంతో 11 నుంచి 12 గంటల వరకు కౌన్సెలింగ్ ఆగిపోయింది. ఆ తర్వాత కూడా రెండు జిల్లాల విద్యాశాఖ అధికారులు ఆర్జేడీ, రాష్ట్ర అధికారులతో ఫోన్లో సంప్రదించి ముందు చెప్పిన విషయాన్ని స్పష్టం చేయడంతో చివరకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అంగీకరించాల్సి వచ్చింది. అనంతరం కౌన్సెలింగ్ కొనసాగింది.